# జనం కోసం..

- చేతి వృత్తుల వారికి ఆసరా...
- అవినీతి రహిత పాలన
- పార్టీలో గ్రూపుల నివారణ
- 'మీ కోసం' యాత్రలో చంద్రబాబు



గద్వాలలో చేనేత కార్మికుడి ఇంట్లో మగ్గం నేస్తున్న చంద్రబాబు

**జనం సమస్యలు తెలుసుకోవడం...హామీలు ఇవ్వడం... ప్రభుత్వ లోపాలు ఎత్తిచూపడం...అధికారంలోకి వస్తే ఆదుకుంటామని భరోసా కల్పించడం... పార్టీ పటిష్టం... నాయకుల మధ్య సమన్వయం... లక్ష్యంగా నాలుగు రోజుల పాటు తెదేపా అధినేత చంద్రబాబు జిల్లాలో సాగించిన 'మీ కోసం' యాత్ర బుధవారం రాత్రితో ముగిసింది. చంద్రబాబు చివరి రోజు అయిజలో బస చేయనున్నారు. గురువారం అయిజ మండలంలో జిల్లా నేతలు, తెలంగాణ కోర్ కమిటీ సభ్యులతో భేటీ అయి తెలంగాణ అంశంపై చర్చించనున్నారు. అనంతరం కర్నూలు జిల్లాలో యాత్ర కొనసాగనుంది.**

మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే

జిల్లాలో 4 రోజుల పాటు కొనసాగిన యాత్రలో తమ్ముళ్ల మధ్య కలహాలు, ముఠా రాజకీయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో పార్టీపై ప్రజలకు ఉన్న మమకారమేమిటో కూడా తెలిసింది. మంగళ, బుధవారాల్లో చంద్రబాబు పర్యటన తెల్లవారుజాము వరకు కొనసాగినా పల్లెల్లో జనం నిద్దరపోకుండా ఘన స్వాగతం పలికారు. బుధవారం గద్వాల నియోజకవర్గంలో సాగిన పర్యటన అక్కడి ఎమ్మెల్యే దంపతులే లక్ష్యంగా సాగింది. ప్రాజెక్టుల్లో అక్రమాలు, నియోజకవర్గంలో అవినీతి కార్యకలాపాలపై ప్రజలతో సమాధానం చెప్పిస్తూ చేసిన ప్రసంగాలు కాస్త ఉద్రిక్తంగానే కనిపించాయి. మత్స్యకారులు, గీత కార్మికులు, రైతుల సమస్యలపై చంద్రబాబు బాగా స్పందించారు. ప్రాజెక్టుల్లో అవినీతితో వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయని తెలిపారు. ఇంకో నాలుగైదు నెలల్లో ఎన్నికలు వస్తాయి... అధికారంలోకి రాగానే అవినీతి పరుల ఆటలు కట్టిస్తామని ప్రతిన బూనారు. డ్వాక్రా మహిళ రుణాలను కూడా రద్దు చేస్తామన్నారు. చిన్న పిల్లలను కూడా ఆకట్టుకునేలా ప్రసంగించారు. పౌష్టికాహారం, సైకిళ్ల పంపిణీ, 2 జతల దుస్తులు అందిస్తామన్నారు.